# రాజకీయం

- తమిరిశ జానకి

"ఇడ్లీ సాంబారులా కలిసిపోయారు జగన్నాథం, ప్రకాశం. నువ్వేదంటే నేనూ అదే, నేనేదంటే నువ్వూ అదే అన్నట్టుగా ఉంటారు. ఇద్దరూ పని చేసేది ఒకే రాజకీయ పార్టీలో. వీళ్ళని పుట్టించిన ఆ బ్రహ్మదేవుడు కూడా వీళ్ళని విడదీయలేడేమో అనుకుంటూ ఉంటారు చూసేవాళ్ళు.

ఔనుమరి గొప్ప రాజకీయ బంధం కదామరి వాళ్ళది. అయినా రాజకీయ బంధాల గురించి ఆ రాజకీయాల్లో మునిగి తేలే దురంధరులకి తెలుస్తుందిగా అయిదేళ్ళకోసారి. గోరుమీద సిరా పూయించుకుని అమ్మయ్య క్షేమంగా పోలింగ్ బూత్‌లోంచి బయటపడ్డాం అంతే చాలు అనుకునేవాళ్ళకీ, లిస్టులో మా పేరుంది అదే పదివేలు అనుకునే వాళ్ళకీ ఏం తెలుస్తుంది?

ఆ రోజు రాత్రి జగన్నాథానికెంతకీ నిద్ర పట్టలేదు. రాజకీయపు రణరంగంలో కెళ్ళాక ఏ రోజూ సరిగ్గా నిద్రలేదు. అది వేరే విషయం. ఈ సారి నిద్ర పట్టకపోవడానికి కారణం వేరే ఉంది. పడుకోబోయే ముందు కొడుకు చక్రధర్ బాంములాంటి మాట పేల్చాడు.

"ఏవిటండీ! నిద్రపట్టట్లేదా?" భార్య సావిత్రి అడిగిన ప్రశ్న మరింత ఒళ్ళు మండించింది.

"నీ పెంపకం ఎలా తగలడిందో చూడు".

"నేనేం చేశానండీ?"

"ఇంకా ఏం చెయ్యాలి? ఒక్కగానొక్క కొడుకు మనకి. ఆ రాజారావు కూతుర్ని... ఒక్కత్తే సంతానం... ఆ పిల్లని మనబ్బాయి కిచ్చి చెయ్యమని అడుగుతున్నాను రాజారావుని. ఆ పిల్లని కోడలిగా తెచ్చుకుంటే కోట్లు నడిచొస్తాయి మనింటికి."

"మీ ఇష్ట ప్రకారమే కానివ్వండి. నేనే వన్నా అడ్డు చెప్పానా? నా మీదెందుకూ విరుచుకు పడతారు?"

"ఎందుకేవిటీ? మనబ్బాయితో ఇందాక ఈ విషయం మాట్లాడాను. వాడొప్పుకో లేదు. రాజారావు కూతుర్ని చేసుకోట్ట"

"ఏం? ఎందుకనీ?"

"ఎందుకని నన్నడుగుతున్నావా?"

"నిజంగా నాకేమీ తెలియదండీ బాబూ!"

"నీ పెంపకం వల్లే వాడు ప్రకాశం కూతుర్ని చేసుకుంటానంటున్నాడు" ఏడవాలో నవ్వాలో తెలియలేదు సావిత్రికి.

"వాడామ్మాయిని చేసుకుంటాననడానికి నా పెంపకానికీ సంబంధం ఏవిటండీ? ఆయనతో అంటిపెట్టుకు తిరిగేది మీరు... ఆయనకి స్నేహితులు మీరు... మీ ద్వారానే కదా మనింటిల్లిపాదికీ వాళ్ళ కుటుంబంతో స్నేహం అయింది... అలాంటప్పుడు వాడేదో నా మూలంగా వాళ్ళమ్మాయిని చేసుకుంటానంటున్నట్టు మాట్లాడతారేంటి?" రాను రాను భర్త ప్రవర్తనకి ఆయన మాటలకి విసిగిపోతున్న సావిత్రి ఉన్నమాటే అంది.

"అదంతా నాకు తెలియదు. రేప్పొద్దున్న వాడితో నువ్వు మాట్లాడి ప్రకాశం కూతుర్ని చేసుకోడానికి వీల్లేదని చెప్పు. రాజారావు కూతుర్ని చేసుకోడానికి ఒప్పించు."

ఆవిడ గుండెల్లో రాయి పడింది. కరవమంటే కప్పకి కోపం... విడవమంటే పాముకి కోపం.

మర్నాడు ఆవిడెంత నచ్చచెప్పాలని చూసినా ఒప్పుకోలేదు చక్రధర్.

!+!+!+!

"మన పార్టీ గ్యారంటీగా గెలిచే ప్లానొకటి వేశాను రామారావు గారూ.

"అలాగా! ఏవిటా ప్లాను చెప్పు తొందరగా జగన్నాథం"

జగన్నాథం చెప్పిన దానికి చాలా సంతోషించి అలాగే చెయ్యమంటూ ఒప్పుకున్నాడు రామారావు.

"మన పార్టీ పదవిలోకి రావడం మనకి ముఖ్యం"

"అందుకే కదా మాస్టర్‌ప్లాన్ వేశాను"

ఇద్దరూ సంబరంగా నవ్వుకున్నారు.

జగన్నాథం వేసిన పథకం గురించి వివరంగా తర్వాత రాజారావుకి కూడా చెప్పాడు రామారావు.

అది విన్న రాజారావు బుఱ్ఱ చురుకుగా ఆలోచించడం మొదలెట్టింది.

"ఏవిటి రాజారావు... నీకునచ్చలేదా ఈ పథకం? పాలక వర్గాన్ని పదదొయ్యడానికి... మనం పదవిలోకి రావడానికి ఇంతకంటే మంచి ఆలోచనేం ఉంటుంది చెప్పు. ప్రజల సానుభూతితో మనం గెల్చిపోవచ్చు పదవిలోకి వొచ్చెయ్యొచ్చు"

"నాకు నచ్చకపోవడం ఏం లేదు. అలాగే కానివ్వండి. నేనాలోచిస్తున్నదేవిటంటే... ఒక దెబ్బకి రెండు పిట్టల్లా పథకం వేశాడు జగన్నాథం అని ఆలోచిస్తున్నాను.

"ఏవిటా రెండు పిట్టలూ?"

"ఒకటి నీకు తెల్సిందే... మన పార్టీ పదవిలోకి రావడం..."

"రెండోది" ఆతృతగా అడిగాడు.

"అదే చెప్తున్నా... వాళ్ళబ్బాయి ప్రకాశం కూతుర్ని చేసుకుంటానని పట్టుపడుతున్నాడుట. అది ఈయనగారికిష్టం లేదు. మా అమ్మాయి కోడలిగా చేసుకోవాలని ఆశపడుతున్నాడు. నాతో అన్నాడు కూడా. తన అంతస్తుకి ప్రకాశం తగడని... పైగా కులాలు వేరని అందుకనే తనకిష్టం లేదని తెగేసి చెప్పాడు. మరి నా అంతస్తుకి తగ్గవాడా ఆయనగారు మా అమ్మాయిని అడగటానికి? కులం కూమా దోమెట్టు ఎక్కువే కదా? నేనెందుకిష్టపడతాను వాళ్ళబ్బాయి నా కూతుర్నివ్వడానికి?"

"ఆమాట చెప్పేశావా అతగాడితో?"

"అంత తెలివి తక్కువ పని చెయ్యలేదు. ఎలక్షన్లయ్యే దాకా జాగ్రత్తగా ఉండదల్చు కున్నాను. అందుకే... ఎలక్షన్లయ్యే దాకా వ్యక్తిగత విషయాలు మనం మాట్లాడుకోవద్దని చెప్పాను."

మంచి పని చేశాను. అయితే ప్రకాశం కూతురు తన ఇంటి కోడలిగా వొచ్చే ఆస్కారమే లేకుండా ఉండేందుకు ఈ పథకం పన్నాదన్నమాట జగన్నాథం.

"ఔను"

"ఇంకో విషయం చెప్పనా?"

"ఏవిటది?" ఆసక్తిగా చూశాడు రాజారావు.

"మన పార్టీ గ్యారంటీగా పదవిలోకొచ్చే పథకం వేశానని పదవిలోకి రాగానే తనడిగిన మంత్రి పదవి తనకిచ్చి తీరాలని చెప్పాడు"

"నువ్వేమన్నావ్?"

"నేనూ తెలివి తక్కువ వాడినేం కాదుగా! మన పబ్బం గడిస్తే అంతే చాలనుకుంటాను. నువ్వు కోరుకున్న శాఖే అడిగాడు తనుకూడా. నీ కివ్వకుండా ఆ శాఖ మరొకరికిచ్చే ప్రసక్తే లేదు. పైగా... అసలు విషయం నీకూ తెల్సుగా... వాడికే మంత్రి పదవీ ఇవ్వద్దని మనిద్దరం నిర్ణయించుకున్నాం కదా! అఫ్‌కోర్స్... మనిద్దరి మధ్యే ఉన్న రహస్యం ఇది.

"మరేం చెప్పావు వాడికి?"

"పార్కలాం అన్నమంత్రం ఉండనే ఉందిగా... ముందు గెలిపించు పార్టీ అలాగే చూద్దాం అన్నాను."

"మంచిపని చేశావు. ఏరుదాటి తెప్ప తగలెయ్యడం మనకి తెలియని విషయం కాదుగా. వాడినెంతలో ఉంచాలో అంతలోనే ఉంచుదాం. వాడి పన్నాగంలో మనకి భాగం లేనట్టే ఉందాం. ఎందుకంటే పన్నాగంలో తేడా పొళాలొచ్చినా ఏ సి.బి.ఐ. వాళ్ళో వాసన పసిగట్టినా... మనం ఇరుక్కోకూడదు. ఇరుక్కుంటే ఆ జగన్నాథమే ఇరుక్కోవాలి గానీ..."

"ఔనౌను.. నా ఉద్దేశ్యమూ అదే..."

జరగరాని ఘోరం జరిగిపోయింది.

ప్రకాశం కుటుంబం వెళ్తున్న కారుని ఓ లారీ గుద్దేసింది. లారీ డ్రైవర్ పారిపోయాడు.

కారుడ్రైవర్‌తో సహా.. కార్లో ఉన్న మిగిలిన ముగ్గురూ... ప్రకాశం, ఆయన భార్య, ఆయన కూతురూ అందరూ కూడా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

అది యాక్సిడెంట్ కాదని... కావాలని లారీడ్రైవర్ కారుని గుద్దేసి పారిపోయాడని ప్రత్యక్ష సాక్షులు ఒకరిద్దరు చెప్పారు.

కానీ... ఆ ఒకరిద్దరూ కూడా ఆ తర్వాత నిమిషం నించీ అయిపూ జాడా లేకుండా వెళ్ళిపోయారు.

లారీకున్న నెంబరు ప్లేటు అసలైనది కాదని తెల్సింది.

ఆ నకిలీ నెంబరు ప్లేటు యాక్సిడెంట్ జరగడానికి కొద్ది సమయం ముందే మార్చ బడిందన్న విషయం మాత్రం ఎవరికీ తెలియదు.

ప్రకాశం నిలబడుతున్న నియోజకవర్గంలో తమ పార్టీ మనిషి గెలవడన్న భయంతో పదవిలో ఉన్న ప్రస్తుత పాలకవర్గమే ఈ పని చేయించింది... ప్రకాశాన్ని హత్య చేయించిందని గొడవ లేవదీశాడు జగన్నాథం. అంతే... నిమిషాల్లో నిప్పురాజుకుంది. ఇంతింతై వటుడింతై అన్నట్టు... రాష్ట్రమంతా రెండు పార్టీల వాళ్ళూ తలపడ్డారు.

ప్రజల సానుభూతి రామారావు-రాజారావుల పార్టీకి దక్కింది. ఆ ఇద్దరూ సంబరంగా చేతులు కలుపుకుని కాబోయే వియ్యంకులుగా ప్రమాణ స్వీకారం చేసుకున్నారు అతి రహస్యంగా.

తను మనస్ఫూర్తిగా ప్రేమించిన అమ్మాయి మరణవార్తతో డిప్రెషన్లో కెళ్ళిపోయిన చక్రధర్ ఓ రోజు పురుగుల మందు తాగేశాడు.

పార్టీ మారే ఆలోచనల్లో వాళ్ళతో వీళ్ళతో జరుపుతున్న కుతంత్రాలతో చాలా బిజీగా ఉన్నాడు జగన్నాథం.

ఎలక్షన్లవ్వగానే పార్టీ మారేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నాడు. రహస్యంగా... ఔను మరి... రాజకీయాలా మజాకానా?

★☆★☆★